

పారిస్ వెళుతున్న బృందంతో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

ఉగ్రవాదాన్ని భారత్ సహించదు : ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ సహించదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల్లో ఎంపీ పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం పారిస్‌కు బయలుదేరి వెళ్లింది.పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి అంతర్జాతీయ వేదికలపై ఈ బృందం వివరిస్తుంది. ఫ్రాన్స్, యూకే, ఈయూ, ఇటలీ, డెన్మార్క్, జర్మనీ దేశాల్లో పర్యటించి జూన్ 8వ తేదీన తిరిగి భారత్ చేరుకుంటుంది. ఈ బృందంలో పురందేశ్వరితో పాటు బీజేపీ ఎంపీ సామిక్ భట్టాచార్య, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ఎంపీ అమర్‌సింగ్, నామినేటెడ్ ఎంపీ గులాం అలీ ఖటాన, ఎంజే అక్బర్, పంకజ్ శరణ్ ఉన్నారు.



కడపలో మహానాడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

నాయకా.. కదలాలిక!

కుర్చీలకు అతుక్కుపోయిన పలువురు ఉద్యోగులు



గవర్నమెంట్ ఐటీఐలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి అదే ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో పనిచేసి.. తిరిగి మళ్లీ ఐటీఐ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. తాజాగా యూనియన్‌లో చేరి మరో నాలుగేళ్లు ఇక్కడే పనిచేసేందుకు స్కెచ్ వేశారు. ఇలా దాదాపు అన్ని విభాగాల్లోని నాయకులు ఈ పాత చింతకాయలాంటి జీవోను పట్టుకుని మరి కొన్నేళ్ల పాటు కార్యాలయంలో చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇటువంటి వారికి కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికత ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో పారదర్శకత కొరవడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని శాఖల్లో కుర్చీలను వదిలేందుకు ఇష్టపడని కొందరు ఉద్యోగులు 'పాత'దారులు వెతుక్కుంటున్నారు.ఎలాగైనా అదే శాఖలో మళ్లీ తిష్టవేయాలని ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులను, జీవోలను పక్కన పెట్టి కాలం చెల్లిన పాత జీవోలను తెరపైకి తెస్తున్నారు. ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయి రాజకీయం చేస్తున్న కొందరు..ఉద్యోగ సంఘాల నాయకులమనే పేరుతో బదిలీలకు బ్రేక్‌లు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి.

స్వీటు అందుకే..

చాలా మంది ఉద్యోగులు బదిలీ అయి వెళ్లడానికి అంగీకరించరు.. ఏదో రకంగా కుర్చీకి అతుక్కుపోవడానికే చూస్తారు.. ఎందుకంటే ఆ సీటుకు ఉన్న డిమాండ్ అటువంటిది.. బాగా ఆదాయవనరు ఉన్న సీటుకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. రూ.లక్షలు పోసి ఆ సీటు సంపాదిస్తారు. అటువంటి సీటును కాపాడుకోవడానికి ఉద్యోగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఖజానా తదితర విభాగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదే జరుగుతోంది.. డిమాండ్ ఉన్న సీటును కాపాడుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సీట్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశమూ ఉంటుంది..

ఈ నెల 31 వరకు గడువు..

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2025 మే 31 నాటికి ఒక స్టేషన్లో ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని సూచించింది.ఒక స్టేషన్లో (అంటే కార్యాలయం లేదా సంస్థ కాదు. వాస్తవంగా పనిచేసే ప్రదేశం(నగరం, పట్టణం, గ్రామం) ఐదేళ్లు పూర్తి చేసిన వారే కాకుండా ఇతర ఉద్యో గులు వ్యక్తిగత అభ్యర్థన మేరకు బదిలీకి అర్హులు. అటువంటి ఉద్యోగులందరికీ ప్రాధాన్యమివ్వాలి. ఇందులో ఆయా ఉద్యోగ సంఘాల్లో పనిచేసిన వారికి కొంత వెసులుబాటు ఉంది. వారు అదనంగా మరో నాలుగేళ్లు అంటే తొమ్మిదేళ్ల పాటు వారు ఒకే స్టేషన్లో పనిచేయవచ్చు. తొమ్మిదేళ్ల పూర్తయ్యాక కచ్చితంగా బదిలీ చేయాలి.

ఉద్యోగుల ప్రయత్నాలు..

ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పనిచేసిన ప్రతి ఉద్యోగిని కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 500 నుంచి 700 మంది బదిలీ కావొచ్చని అంచనా.ఎందుకంటే గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారు కదలాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని విభాగాల్లో దాదాపు ఐదేళ్లు దాటిన వారే కాదు.. 7-10 ఏళ్లకు పైగా ఒకే స్టేషన్లో తిష్టవేసి రాజకీయాలు చేస్తున్న వారూ ఉన్నారు. ముఖ్యంగా ఉద్యోగ సంఘాల పేరుతో తమ బదిలీలను నిలుపుదల చేసుకుంటూ కొందరు వస్తున్నారు. సంఘాల్లో ఉండే నాయకులకు ఐదేళ్లతో పాటు మరో నాలుగేళ్లు కలిపి సుమారు తొమ్మిదేళ్ల పాటు ఒకే స్టేషన్లో పనిచేసే అవ కాశం ఉంది. ప్రస్తుతం కొన్ని శాఖల్లోని ఉద్యోగులు కొందరు సంఘ నేతలుగా అవతారమెత్తి బదిలీ కా కుండా చూసుకుంటున్నారు.ఈ మేరకు కొందరు ఉద్యోగులు రెండు,మూడు నెలల కిందట డబ్బు లు కట్టి ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా చేరిపోయారు. ఎగ్జిక్యూటివ్ పదవులు దక్కించుకున్నారు.తాము యూనియన్లలో ఉన్నామని తమ కు బదిలీలు వర్తించబోవని తప్పించుకుంటున్నారు. ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉండే ప్రభుత్వ ఐటీఐ, టెక్నికల్ ఆర్‌జేడీ,జిల్లా ఉపాధి కార్యాలయాల్లోని పలువురు ఉద్యోగులు సీట్లకు అతుక్కుపోయేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.2012 నాటి సర్క్యులర్ మెమోను చూపించి బదిలీ నుంచి తప్పించుకునేందుకు ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

- ఏళ్లగా ఒకే చోట తిష్ట
- పదేళ్లయినా సీటు వీడని వైనం
- కదిలేందుకు అనాసక్తత
- ఉద్యోగ సంఘాల్లో చేరిక
- పలు ఆఫీసుల్లో ఇదే పరిస్థితి
- ప్రభుత్వ ఉత్తర్వులతో షాక్
- బదిలీలకు ఐదు రోజులే గడువు

సీఎస్ చెక్ పెట్టారిలా..

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ విడుదల చేసిన సర్క్యులర్ మెమో ఇలాంటి నేతల ఆటలకు చెక్ పెట్టినట్టయ్యింది. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీ మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధిపతులు, కలెక్టర్లు, జిల్లా మెజిస్ట్రేట్ల అసోసియేషన్ల నుంచి నిర్ణీత పత్రాలను పొందాలని ప్రభుత్వం సూచించింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ పదవి, పదవీకాలం తదితర విషయాలు అసోసియేషన్ ఉపచట్టాల్లో కవర్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించాలని,వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో తదితర అన్ని విషయాలను ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే సాధారణ బదిలీల్లో మినహాయింపు వర్తింపజేయాలని సూచించారు. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది.

మహా..సందడి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- రేపటి నుంచి మహానాడు
- ఉమ్మడి జిల్లా నుంచి సన్నద్ధం
- నేడు కడపకు టీడీపీ నేతల క్యూ
- కార్యకర్తలు,అభిమానుల సమీకరణ
- నియోజకవర్గాల వారీ ఏర్పాట్లు
- బస్‌లు, కార్లలో తరలింపు
- ప్రత్యేకంగా విందు భోజనం

పసుపు పండుగకు జనం సన్నద్ధమయ్యారు.. తండోపతండాలుగా నాయకులు.. కార్యకర్తలు తరలివెళ్లేలా నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కడపలో ఈ నెల 27,28,29 తేదీల్లో టీడీపీ మహానాడు పండుగ నిర్వహించనున్నారు. ఆ పండుగలో భాగస్వామ్యం కావడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పసుపు దండు కదలనుంది. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల నాయకత్వంలో వేలాదిగా తరలివెళ్లనున్నారు. ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో మహానాడుతో పాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటగా జరగబోయే ఈ మహానాడు కడపలో బ్రహ్మాండంగా నిర్వహించనున్నారు. వైసీపీ అధినేత జగన్‌కు అడ్డాగా ఉన్న కడపలో టీడీపీ గత ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే.ఇవాళ మహానాడు ఘనంగా నిర్వహించడం ద్వారా అక్కడ తమ సత్తా ఏంటో చూపాలనేది టీడీపీ వ్యూహంగా కనిపి స్తోంది. మహానాడు నిర్వహణకు 19 కమిటీలు నియమించిన సంగతి తెలిసిందే. అందులో ముఖ్యమైన తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామ కృష్ణుడు వ్యవహరించడంతో పాటు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.పలు కమిటీల్లో మన ప్రాంత నేతలు కొందరు నేతలు సభ్యులుగా నియమితులయ్యారు. కార్యకర్తలకు కొంతమందికి ఇప్పటికే నామినేటెడ్ పదవులు దక్కాయి. వందలాది పోస్టులు రానున్నాయి. ఈ నేపథ్యంలో మహానాడులో పాల్గొనడానికి టీడీపీ శ్రేణులు బాగా ఉత్సాహ పడుతున్నాయి.గత వైసీపీ అరాచక పాలన నుంచి బయటపడిన ఆనందంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ మహానాడు సన్నాహక సభలు పెట్టుకోవడంతో పాటు జిల్లాల మినీ మహానాడు ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. అందరిలోనూ జోష్ పెరిగింది.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మహానాడులో కచ్చితంగా పాల్గొనాలనే ఆలోచనతో అమెరికా టూర్‌ను మధ్యలోనే ఆపుకుని రావడం గమనార్హం. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ పసుపుదండు ఛలో మహానాడు అంటూ బయలుదేరనుంది.



మహానాడుపై చర్చిస్తున్న మంత్రి సుభాష్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

కడప 950 కి.మీ

ఈ మేరకు నాయకులు ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి కడపకు 950 కిలోమీటర్లు.. కాకినాడ, కోనసీమ నుంచి వెయ్యి కిలోమీటర్లు దాటి ఉంటుంది.రోడ్డు మార్గాన వెళ్లాలంటే 9 గంటలు పైనే పడుతుంది. ఈ నేపథ్యంలో ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం స్నాక్స్.. రాత్రికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీన ఉదయం నుంచే మహానాడు కార్యక్రమం ఆరంభిస్తారు. ఆ సమయానికి అక్కడకు చేరుకునేలా ప్రణాళిక రచిస్తున్నారు.. నియోజకవర్గాల వారీ తరలివెళ్లేలా చూస్తున్నారు. ఏ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆ నియోజకవర్గ ఏర్పాట్లు చేశారు.



హేవలాక్ బ్రిడ్జి

పుష్కలంగా నిధులు..

పుష్కరానికి పనులయ్యేనా!

నేటికీ కదలని అఖండ గోదావరి ప్రాజెక్టు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- రూ.94 కోట్లు నిధులు విడుదల
- పుష్కరఘాట్‌కు టెండర్ ఖరారు
- అభివృద్ధికి ఎదురుచూపులు
- అయినా ఆరంభంకాని పనులు
- అఖండ గోదావరి ప్రాజెక్టు జాప్యం
- పట్టించుకోని అధికారులు

అఖండ గోదావరి ప్రాజెక్టుకు పుష్కలంగా నిధులు వచ్చినా.. పనులు ఆరంభించడంలో అధికారులు జాప్యం చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా బోటు మీద గోదావరి నదిలో పయనించి పర్యాటరంగానికి ఇది చాలా అనువైన ప్రాంతమని భావించారు. వెంటనే అఖండ గోదావరి ప్రాజెక్టు పేరిట రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అఖండ గోదావరి టూరిజానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.ఈ మేరకు అనుకున్నదే తడవుగా రీజినల్ కార్యాలయం పెట్టారు. అధికారినీ నియమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయ డానికి , హేవలాక్ బ్రిడ్జిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ఉపక్రమించారు. కానీ తర్వాత ప్రభుత్వం మారడంతో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, కార్యాలయం ఎత్తేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయంతో నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి విజయం సాధించడం,ఆయన ముఖ్యమంత్రి కావడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ అఖండ గోదావరికి ప్రాణం పోశారు. పైగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా రాజమహేంద్రవరానికి చెందిన కందుల దుర్గేష్ ఉన్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ సాసాతో రూ.94 కోట్లు శాంక్షన్ చేశారు. నిధులు వచ్చేశాయి.ఈ ప్రాజెక్టు కింద రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌ను ఆధ్యాత్మికంగా, పర్యాటక కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.డిజైన్లు సిద్ధమైనట్టు సమాచారం. ఇటీవల టెండర్లు ఖరారు చేశారు. ఇక్కడ మ్యూజిక్ టవర్, నక్షత్ర స్థంభం, ఓం సింబల్, నదిలో నీళ్లు తాగున్నట్టు ఏనుగు విగ్రహాలు.. పలు అభివృద్ధి పనులు చేయనున్నారు. నిధులున్నా ఇంకా పనులు ఆరంభించలేదు. వచ్చేది వర్షాకాలం, వరదల సమయం కావడంతో పుష్కరఘాట్‌లో పనులకు ఆటంకం కలుగు తుంది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జిని పర్యాటక కట్ట డంగా అభివృద్ధి చేయడం, కడియం నర్సరీల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, కడియపులంక కాలువలో బోట్ షికారు,నిడదవోలు కోట సత్తెమ్మ గుడి వద్ద భక్తుల వసతి భవనం,శెట్టిపేట వద్ద కాలువలో బోట్ షికారు వంటి పనులు ఉన్నాయి.ఇంకా టెండర్లు పిలవలేదు.పనులైతే పుష్కరాల నాటికి ప్రభుత్వం యోచించినట్టుగా ఈ ప్రాం తం అభివృద్ధి చెందుతుంది.

రాజమహేంద్రవరం అభివృద్ధి చేసింది నేనే!



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

- నేనేంటో నగర ప్రజలకు తెలుసు
- గత పుష్కరాలకు ఎవరున్నారు..
- తెలుగు వర్శిటీకి పాటుపడ్డా
- చంద్రబాబు, పవన్‌ను కోరా
- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం చరిత్రలో బుచ్చయ్యచౌదరి మమేకమై ఉన్నాడని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నాడు ఎన్టీఆర్ తెలుగు వర్శిటీకి తన స్వహస్తాలతో శంకుస్థాపన చేసి అప్పట్లో 190 ఎకరాలతో ఉన్న భూమిలో కొంత భాగాన్ని కేటాయించారన్నారు. ఇందులోనే ప్రస్తుతం నాక్ భవనం, పాలిటెక్నిక్ కళాశాల,కలెక్టరేట్ తదితర సముదాయాలు ఉన్నాయన్నారు. తెలుగు వర్శిటీకి కేటాయించిన దానిని అప్పట్లో అభివృద్ధి చేశారని..దీనికి చరిత్ర ఉందన్నారు.ఇది తెలియని వారు కొత్తకొత్తగా తామేదో ఉద్ధరించినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.గత పుష్కరాలు.. అంతకు ముందు పుష్కరాలకు నగరంలో రహదారులు విస్తరించి అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు రహదారులు విస్తరించే దమ్ము వీరికి ఉందా అని ప్రశ్నించారు.ఆక్రమణల తొలగింపు పేరుతో పేదోళ్లపై ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు.గోదావరి బండ్ రోడ్డులో గౌతమి నందన వనం, పీవీ.నరసింహరావు పార్కు, ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. సెంట్రల్ లైటింగ్ తెచ్చామన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారి విగ్రహం పగిలిపోతే ఎవ్వరు పట్టించుకోలేదని తానే కట్టించానన్నారు. ఆటోనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ,ఈఎస్ఐ ఆసుపత్రికి తానే కృషి చేశానన్నారు.చరిత్ర తెలియని వారు ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,మంత్రి లోకేశ్‌లను కోరానన్నారు.తెలుగు వర్శిటీ ఏర్పాటు విషయం తొలుత మంత్రి కందుల దుర్గేష్ నోటీస్‌కు వచ్చి ఉంటుందన్నారు. ఆయన కూడా సపోర్ట్ చేశారన్నారు.ఇదేదో ఒక్కరే సాధించినట్టు చెప్పుకోవడం సరికాదన్నారు.అలా చెప్పాల్సి వస్తే సుబ్రహ్మణ్య మైదానంలో సభ పెట్టి మాట్లాడాల్సి వస్తుందని..అప్పుడు ఎవరు ఏమి చేశారో తేలుతుందన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేసి టీడీపీని పటిష్టం చేశారన్నారు. కడపలో జరిగే మహానాడుకు లక్షలాది మంది కార్యకర్తలు తరలివస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టీడీపీ రూరల్ అధ్య క్షుడు మత్సేటి శివసత్యప్రసాద్, టూరిజం డవప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సెక్రటరీ జానీ బాషా

పిల్లల గారాబం వద్దు

డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ

రాజమహేంద్రవరం సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా పిల్లల మనోభావాలను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ జానీ బాషా అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ ఉమెన్స్ కళాశాల ఎదురుగా గల కెవి స్టేట్ హోంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినంలో మాట్లాడారు. పిల్లలను గారాబం చేయకుండా క్రమశిక్షణతో పెంచాలన్నారు.న్యాయ సమస్యలుంటే ఉచిత హెల్ప్ లైన్ 15100ను సంప్రదించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సూర్యప్రభావతి మాట్లాడుతూ పిల్లలను ప్రేమగా పెంచాలన్నారు.ఆర్‌పీఎఫ్ సీఐ రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 73 వేల మంది బాలలు రికార్డుల ప్రకారం తప్పిపోవడం ఆందోళనకరమన్నారు.సదస్సులో బి.జగదీష్,కె.రాజు, శ్రీగౌరి, జెవివి.రమణ, సిహెచ్ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.







చరిత్రకు సాక్ష్యం.. నిర్లక్ష్యానికి నిదర్శనం!


నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం..నేటి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ భవనం..ఈ భవనం ఎక్కడిదంటే రాజమహేంద్రవరం ప్రజలు ఠక్కున చెబుతారు.. ఎందుకంటే ఈ భవనంతో అంత అనుబంధం.. 1857లో ఈ భవనాన్ని నిర్మించారు.1923లో ఆధునీకరించారు.. కాలక్రమంలో రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయంగా వినియోగించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

గోదారి గుట్టు మీద గంపెడు అందాలే..

రాజమహేంద్రవరం గోదావరి గట్టు అంటేనే అందాలకు మారు పేరు. ఆ గట్టు మీద సాయం సమయాన సూర్యుడు అస్తమిస్తుండగా ఆ ఛాయలు గోదావరి మీద పడితే వర్ణ శోభితమే. దాన్ని చూసిన ఎవరైనా మనసు పారేసుకుంటారు. వెంటనే తమ ఫోన్లలో బంధించేందుకు ప్రయత్నించకుండా ఉండలేరు. ఆ దృశ్యాల్నే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..







ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు



పోటీలు ప్రారంభించి పవర్ లిఫ్టింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ పబ్లిక్ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంతైనా అభినందనీయమని, క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. వివిధ విభాగాల క్రీడా పోటీలను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులు ప్రారంభించారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్లు జంగా అబ్బాయివెంకన్న, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరాజు రాము, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, సూదా గణపతి పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి వందన



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న జగన్

విజేతల వివరాలు...

పోటీలు 3 విభాగాల్లో పది కేటగిరీల్లో హోరాహోరీగా జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా దొమ్మేటి వెంకటరమణ, డి.లక్ష్మీనారాయణ, డీఆర్కే నాగేశ్వరరావు, జి.వీరభద్రరావు, ఎ.బాలకృష్ణ, చిక్కం రాజబాబు వ్యవహరించారు. ఆయా విభాగాల విజేతలను జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పవర్‌లిఫ్టింగ్ 53 కిలోల మెన్ విభాగంలో వై.వీరబాబు (పి.గన్నవరం) ప్రథమ, జె.జితేంద్రదొర (అమలాపురం) ద్వితీయ, సీహెచ్.సంపత్ (కాకినాడ) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం), వై.మహేష్, పి.సతీష్ (కాకినాడ) వరుస స్థానాల్లో నిలిచారు. 66కిలోల విభాగంలో ఎం.జగన్ (కాకినాడ), ఎ.దుర్గాప్రసాద్ (ద్రాక్షారామం), బి.నానిబాబు (కాకినాడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. మహిళా విభాగంలో పిల్లి వందన (అమలాపురం) ప్రథమ, బి.అఖిల (రామచంద్రపురం) ద్వితీయ, బి.సింధు (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. మాస్టర్స్ విభాగంలో బి.అప్పన్న (అమలాపురం) ప్రథమ, డి.నాగేశ్వరరావు (రామచంద్రపురం) ద్వితీయ, ఏఎస్.ప్రసాద్ (అమలాపురం) తృతీయస్థానాలు సాధించారు.

సత్యవాడలో అధికారులు అప్రమత్తం

కరోనా కేసు నమోదుతో మెడికల్ క్యాంపు ఏర్పాటు, ఇంటింటా ఆరోగ్యంపై సర్వే



ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

కె.గంగవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో కరోనా కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర ఆదేశాలతో రామచంద్రపురం సబ్‌డివిజన్ అధికారి డాక్టర్ ప్రశాంతి, పామర్రు ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పోలిశెట్టి హర్షిత, డాక్టర్ పసుపులేటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సత్యవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే చేయించారు. అనారోగ్యం బారిన పడిన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని, కరోనా వైరస్ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతేక పారిశుధ్య నిర్వహణ నిర్వహించారు. కరోనా నిర్ధారణ అయిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. వైద్య శిబిరంలో సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఉప సర్పంచ్ సలాది శ్రీనివాసు పాల్గొన్నారు.

బాలబాలాజీ కల్యాణోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు ఆదివారం పందిరి రాట పాతడంతో ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణల మధ్య ఆదివారం సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు కల్యాణోత్సవాలకు శ్రీకారంచుట్టారు. వైశాఖ మాసం కృష్ణపక్షం త్రయోదశి అశ్వినీ నక్షత్ర శుభ ముహూర్తాన పందిరి రాటను పాతి ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు కలగకుండా ఉండాలని కోరారు. జూన్ 5 నుంచి 9 వరకు కల్యాణోత్సవాల సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 6న రాత్రి 9.15 గంటలకు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.



పందిరి రాట పాతుతున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు విజయరామ్

కాకినాడలో ఉమ్మడి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న విజయరామ్

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యకర సమాజానికి దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు, సేంద్రియ నిపుణుడు ఎం.విజయరామ్ పేర్కొన్నారు. ప్రకృతి రాగా సంస్థ అధినేత అజ్జరపు మల్లికార్జునరావు అధ్యక్షతన కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయరామ్ జ్యోతిప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు, పండ్లను పండించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవచ్చన్నారు. భూతాపాన్ని తగ్గించేందుకు, భవిష్యత్తు తరాల వారు రోగాల బారినపడకుండా రక్షించేందుకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా రసాయనాల వాడకం లేని పంట ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చన్నారు. పశు సంపదను రక్షించుకోకపోతే మానవాళికి భవిష్యత్తు ఉండదన్నారు. భూ సమతుల్యత, వైవిధ్యం కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యత అన్నారు. రాత్రి సమయాల్లో పశువులను తరలిస్తున్న వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో కెప్టెన్ మల్లికార్జునరావు దంపతులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఆకట్టుకుందన్నారు. భవిష్యత్తు తరాల వారు ఆరోగ్యకరంగా జీవించాలంటే సేంద్రియ వ్యవసాయం ప్రధానమన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, వ్యవసాయ విధి విధానాలు, గోమాత విశిష్టతను సమగ్రంగా వివరించారు. కెప్టెన్ మల్లికార్జునరావు అధ్యక్షోపన్యాసం, రాజమహేంద్రవరానికి చెందిన అంబటి శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. సదస్సులో వల్లూరి మధు, మైలవరపు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, సాగర్ రాజా, సంప్రదాయ వ్యవసాయదారులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులతో అల్పాహారం, భోజనం తయారుచేయించి అతిథులకు, సభికులకు వడ్డించారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

రెండు ఆవులకు గాయాలు



మృతిచెందిన లేగ దూడ

గోకవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ఒక లేగ దూడ మృతిచెందగా, గ్రామంలోని నాగులపాటి నారాయణకుమార్‌కు చెందిన రెండు ఆవులకు గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

‘లోవ’కు పోటెత్తిన భక్తులు

రూ.5.54 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో భక్తులు

తుని రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలలో బారులుతీరిన భక్తులు తల్లిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.54 లక్షల ఆదాయం సమకూరినట్టుఈవో పి.విశ్వనాధరాజు చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

అపార సహజవాయువు, చమురు నిక్షేపాలను రక్షించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్‌లో అపార సహజవాయువు, చమురు నిక్షేపాలు ఉన్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవ్ పిలుపునిచ్చారు. కేజీ బేసిన్‌లో లభ్యమవుతున్న చమురు, సహజ వాయువులపై రాష్ట్ర వాటాను సాధించుకునేందుకు సంఘటితంగా కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం చమురు, సహజవాయు ఖనిజాలు, ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు, వాటిని సంరక్షించేందుకు నిర్వహించిన సదస్సుకు సామాజికవేత్త ఆలపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్ల విలువైన సహజ వాయువు నిల్వలు రాష్ట్రాన్ని దాటి పోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. బాంబే హైలో కూడా లేని సహజ వనరులు కేజీ బేసిన్‌లో ఉన్నాయన్నారు. వాటిని ప్రైవేటు సంస్థలు తరలించబోతున్నాయని, దాని వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ప్రజలంతా ఏకమై సహజ వాయువు దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు కలసికట్టుగా చట్ట సభల్లో ప్రశ్నిస్తే రాష్ట్రానికి రావాల్సిన వాటా ఖచ్చితంగా దక్కుతుందన్నారు. గ్యాస్ పైపులైన్ల ఏర్పాటుతో రైతులు భూములు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రిలయన్స్ కార్యకలాపాల వల్ల తీరప్రాంతం వెంబడి తీరని నష్టం జరుగుతుందన్నారు. నష్ట నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవడంలేదని మహాదేవ్ విమర్శించారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కొల్లా రాజమోహన్ మాట్లాడారు. సదస్సులో డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, వంటెద్దు వెంకన్నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు తదితరులున్నారు.

అంతర్వేదిలో కొండచిలువ హతం



అంతర్వేది దేవస్థానం గ్రామంలో స్థానికులు హతమార్చిన కొండచిలువ

అంతర్వేది, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఆదివారం ఉదయం కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక రాజుల అన్నదాన సత్రంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అన్నదాన సత్రానికి ఉన్న మంచినీటి సంపులోకి 2 మీటర్లు ఉన్న కొండచిలువ జారిపోవడంతో స్థానికులు చాకచక్యంగా పట్టుకునిహతమార్చారు.

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..



వధూవరులను ఆశీర్వదిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి దంపతులు

ప్రేమకు హద్దులు, సరిహద్దులు ఉండవు. అందుకు ఉదహరణగా నిలిచారు ఈ దంపతులు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన తుమ్మల అభి గత పదేళ్లుగా అమెరికాలోని సియోటెల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేస్తున్న కింబర్లీ అనే యువతితో పరిచయడం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. వారి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయి. దీంతో అబ్బాయి స్వగ్రామం పులిమేరులో ఆదివారం వారి వివాహం దీనిని హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. అమెరికా అమ్మాయి, ఆంధ్ర అబ్బాయి వివాహ వేడుకను చూసేందుకు జనం తరలివచ్చారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి హాజరై జంటను ఆశీర్వదించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)

ఎస్‌ఎంసీ చైర్మన్ మృతదేహం లభ్యం



తుల్యభాగ డ్రెయిన్‌లో లభ్యమైన సత్యం మృతదేహం

కరప, మే 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఎస్‌ఎంసీ చైర్మన్ కొలిశెట్టి సత్యం(42) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కొలిశెట్టి సత్యం స్థానికంగా బిర్యానీ సెంటర్ నిర్వహిస్తుండడంతో పాటు గొల్లపాలెం హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన సెల్‌లో మాట్లాడుతూ గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక్కసారిగా దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో కరప పోలీసులు, కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది, గజఈతగాళ్లు, స్థానిక మత్స్యకారులు తుల్యభాగ డ్రెయిన్‌లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాని విషయం పాఠకులకు విదితమే. ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్ సహకారంతో గాలింపు చేపట్టగా మట్లపాలెం వద్ద సత్యం మృతదేహం లభ్యమైంది. స్థానిక వీఆర్వో సమక్షంలో శవపంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్యభర్తల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా సత్యం ఆత్మహత్య కు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. సత్యం మృతితో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనాస్థలి వద్ద కుటుంబసభ్యుల రోదనలతో పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కరప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చురీలో బిహార్ యువకుల మృతదేహాలు

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ వద్ద శనివారం లారీ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన బిహార్ యువకులు ధీరజ్‌కుమార్, చందన్‌కుమార్‌మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆదివారం పోస్టుమార్టం జరగలేదు. మృతుల కుటుంబీలకు శనివారం రాత్రే సమాచారం అందించినప్పటికీ వారు రాకపోవడం వల్లే పోస్టుమార్టం వాయిదా పడినట్టు తెలుస్తోంది. సోమవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబాలకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.





కోనసీమలో కూసింత సేపు కూత!

రావులపాలెం (ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాత వంతెన మీదుగా ట్రాలీ లారీపై రైల్ ఇంజన్ బోగీని ఆదివారం తరలించారు. తణుకు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న దీన్ని కొత్త వంతెన మీదుగా చూసిన వారు ఇదేంటి కోనసీమకు రైల్వే లైన్ వచ్చేసిందా, ఈ ట్రైన్ ఎప్పటి నుంచి రాకపోకలు సాగిస్తోందంటూ చమత్కరిస్తూ ఆసక్తిగా తిలకించి ఫొటోలు తీసుకున్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

వనుములమ్మకి ఎమ్మెల్యే దంపతుల పూజలు

అనపర్తి, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలమూరు గ్రామదేవత వనుములమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారి దర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయకమిటీ మనస్ఫూర్తిగా స్వాగతం పలికింది.



వైద్యులతో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

కొవిడ్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు మళ్లీ నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు భయపడవద్దని, కానీ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజలను హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం ఆయన ప్రభుత్వ బోధనాసుపత్రిని సందర్శించారు. కొవిడ్‌కు సంబంధించి ప్రభుత్వాసుపత్రిలో 20 పడకల ప్రత్యేక వార్డును సిద్ధం చేశామని, వైద్యులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో సిద్ధంగా ఉన్నారని అన్నారు. కొవిడ్ లక్షణాలతో ఆసుపత్రికి వచ్చేవారికి, వైద్య పరీక్షల్లో కొవిడ్ అని నిర్ధారణ అయిన వారికి వేర్వేరుగా వార్డులు ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. ప్రతిఒక్కరికీ మాస్కులు అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు.



ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకునే ముందస్తుగానే అన్నదానం చేస్తున్న యర్రావేణుగోపాలరాయుడు

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి

● 102వ జయంతిలో టీడీపీ నేత యర్రా

రాజమహేంద్రవరం సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగిన నటుడు, బహుముఖప్రజ్ఞాశాలి, పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేసిన మహానాయకుడు మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెంటనే కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జయంతి రోజు కడప టీడీపీ మహానాడు సభలో తామంతా ఉంటాం కాబట్టి ముందుగానే రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో ఆదివారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని యర్రా వేణు అన్నదానం చేశారు. దీనికి టీడీపీ గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ పేద ప్రజల హృదయాల్లో అన్న ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యిన్నమూరి రాంబాబు, మాటూరి రంగారావు, టీడీపీ నాయకులు సానా దుర్గాప్రసాద్, కర్రి సూర్యనారాయుడు, ఉగ్గిన శేఖర్, కంది కిషోర్, బూసి వజ్రనాద్, జనసేన నాయకులు అల్లాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వంట సామాన్లు అందజేత

● పూర్వ విద్యార్థుల దాతృత్వం

రాజమహేంద్రవరం సిటీ, మే25(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీరాజబాబు ఉన్నత పాఠశాల 2007-2008 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రాజమహేంద్రవరంలో చంద్రబోస్ చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగులకు వంట తయారీ పరికరాలు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న పూర్వవిద్యార్థులు తమ బ్యాచ్ అందరి తరఫున ఎన్‌వీవీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న చంద్రబోస్ ట్రస్ట్‌కు రైస్ బ్యాగ్‌లు, వంటపాత్రలు, కుర్చీలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉల్లి సుబ్బారావు, సంతోష్, నాగేంద్ర, లోకేష్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామాన్లు అందిస్తున్న రాజబాబు ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్నా క్యాంటీన్లు

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కష్టపడి పనిచేసుకునే నిరుపేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్నా క్యాంటీన్లు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని పంచాయతీ రామాలయ ప్రాంగణంలో రూ.61లక్షల నిధులతో నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవ న నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి భూమిపూజ చేసి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు లక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అన్నా క్యాంటీన్లను ఏర్పాటుచేశారన్నారు. అనపర్తిలో కూడా అన్నా క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ చేయడం ఆనందంగా ఉందని త్వరలోనే క్యాంటీన్ వాడుకలోకి తీసుకువచ్చి పేదల ఆకలి తీరుస్తామని అన్నారు. ముందుగా అనపర్తి మండలం రామవరంలో గొడ్డు కాలువకు సంబంధించి ఆరుచోట్ల రూ.27.20లక్షలతో నిర్మించనున్న రిటైర్నింగ్ వాల్ నిర్మాణపనులకు, ఎస్సీ కాలనీలో రూ.4లక్షల నిధులతో నల్ల కాలువకు డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అనపర్తి, రామవరం సర్పంచ్‌లు వారా కుమారి, గిరిడా గంగాభవాని, ఎమ్‌పీడీవో ఎమ్ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, కూటమి నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, రావాడ నాగు, కర్రి శేషారత్నం, సుభాషిణి, ఎస్‌ఆర్‌కె ప్రసాదరెడ్డి, నూతిక బాబూరావు, బాచి, కొవ్వూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లికి రేషన్‌డీలర్ల సత్కారం

అనపర్తి మే 25 (ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ వాహనాలను రద్దుచేస్తున్న సందర్భంగా ఆదివారం అనపర్తి మండలం రామవరంలో పెదపూడి మండలం రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్‌వాహనాలను ఏర్పాటుచేసి పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా పంపిణీ జరగాలని ఆయన డీలర్లను కోరారు. పెదపూడి మండల కూటమి నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



అనపర్తిలో అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర కౌన్సిల్ సభ విజయవంతం చేయాలి

● ఏపీజీఈఏ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

రాజమహేంద్రవరంఅర్బన్, మే25 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన జరుగనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం సభను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ సమావేశానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో తూర్పుగోదావరిజిల్లా నుంచి ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. పెండింగ్ డీఏలతోపాటు పీఆర్‌సీ వేసి ఐఆర్ ప్రకటించాలని కోరుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పాక్షికంగా చెల్లింపులు మాత్రమే చేసిందని, బకాయిలు పూర్తిగా చెల్లించాలని కోరుతున్నామని తెలిపారు. వైద్యసేవల్లో ప్రధానపాత్ర పోషిస్తున్న సెకండరీ హెల్త్ పరిధిలోని ఆసుపత్రుల్లో అవుట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగులసంఖ్య పెరిగినందున కేడర్ స్ట్రెంగ్త్‌ను మార్చి ఉద్యోగులసంఖ్యను పెంచుతూ ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల్లో రేడియోగ్రాఫర్ల పోస్టులు మంజూరు చేయాలని ఆయన కోరారు.



బిక్కవోలులో బదిలీ దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో

బదిలీలకు 66 దరఖాస్తులు

బిక్కవోలు, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో బదిలీలకు 66మంది ఉపాధ్యాయుల నుం చి దరఖాస్తులు అందాయని మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి 60 ఉన్నాయని వీరిలో ఐదేళ్లు నిండి తప్పని సరి బదిలీలకు గురైనవారు నలుగురు ఉన్నారన్నారు. అలాగే పీఎస్‌హెచ్‌ఎంల నుంచి 6 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో నలుగురు సర్‌ప్లస్ టీచర్ల దరఖాస్తులు వున్నాయన్నారు. దరఖాస్తులన్నింటినీ పరిశీలించి కాకినాడ డీఈఓ కార్యాలయానికి అందజేసినట్లు ఎంఈఓ వివరించారు.

గోదావరిని ఆనుకుని ఉన్న రైతులను ఆదుకోవాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో గోదావరి గట్టును ఆనుకుని వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రతిఏటా జూన్, జూలైలో సంభవించే వరదల కారణంగా నష్టపోతున్నారని, వరదనీటిని పంపింగ్ ద్వారా గోదావరిలోకి మళ్లించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నామని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయించాలని కోరుతూ జూన్ 2న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్‌పై విచారణ జరిపించాలి'

రంగంపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరు తో జరుగుతున్న మారణహోమాన్ని ఖండిస్తూ, సుప్రీంకోర్టు స్వతంత్ర న్యాయకమిషన్ చేత విచారణ జరిపించాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సింగంపల్లి, సీపీ రెడ్డి నగర్ కాలనీలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మావోయిస్టు కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావుతో సహా అమరులందరికీ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా నాయకుడు వల్లూరి రాజబాబు, దేశెట్టి సురేష్, చెక్కా సత్తిబాబు, కొల్లి రాంబాబు, రాయుడు కన్నా, పద్మ, రత్నం, జగన్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు రెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు.

షాదీఖానా, బరియల్ గ్రౌండ్ స్థలాలపై చర్చించిన గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ పరిధిలోని పలు ప్రాంతాలలో షాదీఖానా, బరియల్ గ్రౌండ్, వక్ఫ్‌బోర్డు స్థలాలపై ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చర్చించారు. ఆదివారం తన నివాసంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీ, వక్ఫ్‌బోర్డు ప్రత్యేక అధికారి సులేమాన్ బాషాలతో సమావేశం నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలో శాటిలైట్‌సిటీ బరియల్ గ్రౌండ్, కొంతమూరు షాదీఖానా, కడియం వక్ఫ్‌బోర్డు స్థలాల సమస్యలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ నూర్‌బాషా సాధికార సమితి కన్వీనర్ షేక్ సుభాన్ పాల్గొన్నారు.



వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ షఫీ, ప్రత్యేకాధికారి సులేమాన్ బాషాలతో చర్చిస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

సాగునీటి సరఫరాలో అలసత్వం వద్దు

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, మే 25(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందించడంలో అలసత్వం చేయవద్దని ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ అధికారులకు ఆదేశించారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో ఎమ్మెల్యే ఆదివారం సమావేశమై రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ కాలువలకు పడిన గండ్లు పూడ్చిపె ట్టి, రానున్న ఖరీఫ్ సీజన్ పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించడం లో ఏవిధమైన ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ, ఇతర అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



శ్రీరంగపట్నంలో రైతులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

'వ్యాయామంతో ఆరోగ్యం పదిలం'

రాజమహేంద్రవరంకల్చరల్, మే 25(ఆంధ్రజ్యోతి): స్థానిక లా హస్పిన్‌హోటల్‌లో ఆరోగ్యకరమైన జీవనశైలి,యోగా ప్రాముఖ్యత, సమాజ ఆరోగ్య అవగాహన పెంపుదలపై ఆరోగ్య భారతి సంస్థ ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ కాకాని పృథ్వీరాజు, ఆరోగ్య భారతి సంస్థ లక్ష్యాలు, సంస్థ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. డాక్టర్ పీఎస్‌రావు ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశంపై ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మానసిక ఆరోగ్యం గురించి వివరించారు. బహిరంగ చర్చా సెషన్‌ను డాక్టర్ పరమహంస నిర్వహించగా డాక్టర్ కాండ్రు మురళీకృష్ణ, డాక్టర్ నీలిమ, డాక్టర్ కర్రి రామారెడ్డి వంటి ప్రముఖ వైద్యులు ఆరోగ్య కార్యక్రమాలను విస్తృత పరచి, ప్రజలలో అవగాహన పెంపొందించాలని తీర్మానించారు.

అంతర్జాతీయ సదస్సుకు జీజీయు విద్యార్థులు

రాజానగరం, మే 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23, 24 తేదీల్లో జరిగిన ఈఎల్‌టీ సమ్మిట్ 2025 అంతర్జాతీయ ఆన్‌లైన్ సదస్సులో గోదావరి గ్లోబల్ యూనివర్శిటీకి చెందిన ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించి ప్రశంసలు అందుకున్నట్లు జీజీయు ప్రొవైస్‌చాన్సలర్ కేవీబీ రాజు తెలిపారు. అంత ర్జాతీయ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ (ఐఎస్‌ఈఏ), (యుఎస్ఏ, ఆస్ట్రేలియా, ఇండియా)ఎంఐటీ ఆర్ట్ డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ పూణే సంయుక్తంగా, కేంబ్రిడ్జి యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్ యూకే సహకారంతో ఈ సదస్సు నిర్వహించాయన్నారు. ఏఐ యుగంలో ఈఎల్‌టీ అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో విద్యార్థులు కె.యశ్వంత్‌రెడ్డి, ఎం.స్నేహిత్‌బాబు, హర్ష్ శ్రీవాస్తవ్, మనీష్ తమ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై తమ విశ్లేషణలను సమర్పించారన్నారు. ఇంగ్లీష్ ప్రొఫెసర్ అదితి అభిషిక్త ఈ పేపర్ ప్రజెంటేషన్ సెషన్‌కు చైర్‌పర్సన్‌గా వ్యవహరించి, అధ్యక్షత వహించారన్నారు. విద్యార్థుల కృషిని, ప్రతిభను సదస్సులో పాల్గొన్న వారంతా అభినందించారన్నారు.

గొయ్యిలోకి దూసుకుపోయిన ఆటో

● త్రుటిలో తప్పిన ప్రమాదం



కుమ్మరిగొయ్యిలోకి పడిపోయిన ఆటో

సీతానగరం, మే 25(ఆంధ్రజ్యోతి): సీతానగరం బస్టాండ్ సెంటర్‌వద్ద నున్న కుమ్మరి గొయ్యివద్ద ఆదివారం ఆటో గొ య్యిలోకి దూసుకుపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సీతానగరం బస్టాండ్ వద్ద కుమ్మరి గొయ్యిని ఆనుకుని ఆటోస్టాండ్ ఏర్పాటుచేశారు. అక్కడ నిత్యం సుమారు 5 ఆటోల వరకు నిలుపుతారు. బస్సులు ఆలస్యంగా వచ్చినప్పుడు ప్రయాణికులు ఆటోలో వెళ్లే ప్రయత్నంలో ఆటోలో సీటుకోసం ముందుగానే ఎక్కి కూర్చుంటారు. ఆటో నిండిన తరువాతగాని ప్రయాణ సాగదు. ఈ నేపథ్యంలో ఆదివారం కుమ్మరిగొయ్యి పక్కన ఉన్న ఆటోస్టాండులోని ఒక ఆటో (ఖాళీఆటో)అదుపు తప్పి కుమ్మరి గొయ్యిలోకి దూసుకు పోయింది. ఆ గొయ్యి సుమారు 25మీటర్లు వరకు ఉంటుంది కాగా ఆటో గొయ్యిలోకి వెళ్లేచోట మొక్కలు ఉండడంతో అక్కడ చిక్కుకుని ఉండిపోయింది. దీంతో స్థానికులు ఎక్స్‌కవేటర్‌తో ఆటోను బయటకు తీశారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు ఉంటే ఘోరప్రమాదం జరిగేది. ప్ర మాదపుటంచున ఉన్న ఆటో స్టాండ్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు. కుమ్మరిగొయ్యికి ఎటువంటి రక్షణ కంచె లేకపోవడం గమనార్హం.

వీరాస్వామి సేవలు మరువలేనివి



తాడాల వీరాస్వామి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడియం, మే 25(ఆంధ్రజ్యోతి): నర్సరీరంగ అభివృద్ధికి దివంగత తాడాల వీరాస్వామి చేసినసేవలు మరువలేనివని నర్సరీ రైతులు పాటంశెట్టి చినమహాలక్ష్మినాయుడు, జేటీ రామారావులు తెలిపారు. ఆదివారం బుర్రిలంకలో తాడాల వెంకట్రాయుడునగర్‌లో వీరాస్వామి విగ్రహంవద్ద ఆయన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు సంయుక్తంగా వీరాస్వామి 94వ జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రూరల్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ తాడాల కొండ్రాజు, వీరాస్వామి కుటుంబసభ్యులు, ఆయన కుమారులు, మనుమలు,కాలనీవాసులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం



త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహిస్తున్న సిద్ధాంత ప్రబోధ సేవా సమితి

సీతానగరం, మే25(ఆంధ్రజ్యోతి) త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వంగలపూడి, సింగవరం సీతానగరం, చినకొండేపూడి గ్రామాలలో త్రైత సిద్ధాం త భగవద్గీత ప్రచారం, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానంను తెలియజేస్తుందని ప్రతిఒక్కరూ కర్మయోగం, విశిష్టత త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయ్, జయరాం, వ్యాస్, భరత్ అన్నవరం, లోహిత, సోమినాయుడు, గోవిందు లక్ష్మీనారాయణ, సంతోష్, సాత్విక్ సంధ్యారాణి, సత్యవతి ,సరిత, వరలక్ష్మీదేవి, సూర్యకుమారి, చిన్నారి పాల్గొన్నారు

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజు పాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మకి ఆదివారం ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి హుండీని లెక్కించగా రూ. 1,50,697 వచ్చినట్టు ఈవో వి. హరిసూర్యప్రకాష్ తెలిపారు. దేవస్థాన ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.



5న ఏపీజీఈఏ సమావేశం

రాజమహేంద్రవరంఅర్బన్, మే25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5వ తేదీన అమరావతిలో నిర్వహిస్తారని జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరవుతారన్నారు.జిల్లా నుంచి ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.



పారిస్ వెళుతున్న బృందంతో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

ఉగ్రవాదాన్ని భారత్ సహించదు : ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ సహించదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాల్లో ఎంపీ పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం పారిస్‌కు బయలుదేరి వెళ్లింది.పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్, ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి అంతర్జాతీయ వేదికలపై ఈ బృందం వివరిస్తుంది. ఫ్రాన్స్, యూకే, ఈయూ, ఇటలీ, డెన్మార్క్, జర్మనీ దేశాల్లో పర్యటించి జూన్ 8వ తేదీన తిరిగి భారత్ చేరుకుంటుంది. ఈ బృందంలో పురందేశ్వరితో పాటు బీజేపీ ఎంపీ సామిక్ భట్టాచార్య, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ఎంపీ అమర్‌సింగ్, నామినేటెడ్ ఎంపీ గులాం అలీ ఖటాన, ఎంజే అక్బర్, పంకజ్ శరణ్ ఉన్నారు.



కడపలో మహానాడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

నాయకా.. కదలాలిక!

కుర్చీలకు అతుక్కుపోయిన పలువురు ఉద్యోగులు



గవర్నమెంట్ ఐటీఐలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి అదే ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో పనిచేసి.. తిరిగి మళ్లీ ఐటీఐ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. తాజాగా యూనియన్‌లో చేరి మరో నాలుగేళ్లు ఇక్కడే పనిచేసేందుకు స్కెచ్ వేశారు. ఇలా దాదాపు అన్ని విభాగాల్లోని నాయకులు ఈ పాత చింతకాయలాంటి జీవోను పట్టుకుని మరి కొన్నేళ్ల పాటు కార్యాలయంలో చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇటువంటి వారికి కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికత ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.

- ఏళ్లగా ఒకే చోట తిష్ట
- పదేళ్లయినా సీటు వీడని వైనం
- కదిలేందుకు అనాసక్తత
- ఉద్యోగ సంఘాల్లో చేరిక
- పలు ఆఫీసుల్లో ఇదే పరిస్థితి
- ప్రభుత్వ ఉత్తర్వులతో షాక్
- బదిలీలకు ఐదు రోజులే గడువు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో పారదర్శకత కొరవడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని శాఖల్లో కుర్చీలను వదిలేందుకు ఇష్టపడని కొందరు ఉద్యోగులు 'పాత'దారులు వెతుక్కుంటున్నారు.ఎలాగైనా అదే శాఖలో మళ్లీ తిష్టవేయాలని ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులను, జీవోలను పక్కన పెట్టి కాలం చెల్లిన పాత జీవోలను తెరపైకి తెస్తున్నారు. ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయి రాజకీయం చేస్తున్న కొందరు..ఉద్యోగ సంఘాల నాయకులమనే పేరుతో బదిలీలకు బ్రేక్‌లు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి.

ఈ నెల 31 వరకు గడువు..

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2025 మే 31 నాటికి ఒక స్టేషన్లో ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని సూచించింది.ఒక స్టేషన్లో (అంటే కార్యాలయం లేదా సంస్థ కాదు. వాస్తవంగా పని చేసే ప్రదేశం(నగరం, పట్టణం, గ్రామం) ఐదేళ్లు పూర్తి చేసిన వారే కాకుండా ఇతర ఉద్యో గులు వ్యక్తిగత అభ్యర్థన మేరకు బదిలీకి అర్హులు. అటువంటి ఉద్యోగులందరికీ ప్రాధాన్యమివ్వాలి. ఇందులో ఆయా ఉద్యోగ సంఘాల్లో పనిచేసిన వారికి కొంత వెసులుబాటు ఉంది. వారు అదనంగా మరో నాలుగేళ్లు అంటే తొమ్మిదేళ్ల పాటు వారు ఒకే స్టేషన్లో పనిచేయవచ్చు. తొమ్మిదేళ్ల పూర్తయ్యాక కచ్చితంగా బదిలీ చేయాలి.

సీటు అందుకే..

చాలా మంది ఉద్యోగులు బదిలీ అయి వెళ్లడానికి అంగీకరించరు.. ఏదో రకంగా కుర్చీకి అతుక్కుపోవడానికే చూస్తారు.. ఎందుకంటే ఆ సీటుకు ఉన్న డిమాండ్ అటువంటిది.. బాగా ఆదాయవనరు ఉన్న సీటుకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. రూ.లక్షలు పోసి ఆ సీటు సంపాదిస్తారు. అటువంటి సీటును కాపాడుకోవడానికి ఉద్యోగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఖజానా తదితర విభాగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదే జరుగుతోంది.. డిమాండ్ ఉన్న సీటును కాపాడుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సీట్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశమూ ఉంటుంది.

ఉద్యోగుల ప్రయత్నాలు..

ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పనిచేసిన ప్రతి ఉద్యోగిని కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 500 నుంచి 700 మంది బదిలీ కావొచ్చని అంచనా.ఎందుకంటే గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారు కదలాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని విభాగాల్లో దాదాపు ఐదేళ్లు దాటిన వారే కాదు.. 7-10 ఏళ్లకు పైగా ఒకే స్టేషన్లో తిష్టవేసి రాజకీయాలు చేస్తున్న వారూ ఉన్నారు. ముఖ్యంగా ఉద్యోగ సంఘాల పేరుతో తమ బదిలీలను నిలుపుదల చేసుకుంటూ కొందరు వస్తున్నారు. సంఘాల్లో ఉండే నాయకులకు ఐదేళ్లతో పాటు మరో నాలుగేళ్లు కలిపి సుమారు తొమ్మిదేళ్ల పాటు ఒకే స్టేషన్లో పనిచేసే అవ కాశం ఉంది. ప్రస్తుతం కొన్ని శాఖల్లోని ఉద్యోగులు కొందరు సంఘ నేతలుగా అవతారమెత్తి బదిలీ కా కుండా చూసుకుంటున్నారు.ఈ మేరకు కొందరు ఉద్యోగులు రెండు,మూడు నెలల కిందట డబ్బు లు కట్టి ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా చేరిపోయారు. ఎగ్జిక్యూటివ్ పదవులు దక్కించుకున్నారు.తాము యూనియన్లలో ఉన్నామని తమ కు బదిలీలు వర్తించబోవని తప్పించుకుంటున్నారు. ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉండే ప్రభుత్వ ఐటీఐ, టెక్నికల్ ఆర్‌జేడీ,జిల్లా ఉపాధి కార్యాలయాల్లోని పలువురు ఉద్యోగులు సీట్లకు అతుక్కుపోయేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.2012 నాటి సర్క్యులర్ మెమోను చూపించి బదిలీ నుంచి తప్పించుకునేందుకు ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

సీఎస్ చెక్ పెట్టారిలా..

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ విడుదల చేసిన సర్క్యులర్ మెమో ఇలాంటి నేతల ఆటలకు చెక్ పెట్టినట్టయ్యింది. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీ మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధిపతులు, కలెక్టర్లు, జిల్లా మెజిస్ట్రేట్ల అసోసియేషన్ల నుంచి నిర్ణీత పత్రాలను పొందాలని ప్రభుత్వం సూచించింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ పదవి, పదవీకాలం తదితర విషయాలు అసోసియేషన్ ఉపచట్టాల్లో కవర్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించాలని,వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో తదితర అన్ని విషయాలను ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే సాధారణ బదిలీల్లో మినహాయింపు వర్తింపజేయాలని సూచించారు. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది.

మహా..సందడి

- రేపటి నుంచి మహానాడు
- ఉమ్మడి జిల్లా నుంచి సన్నద్ధం
- నేడు కడపకు టీడీపీ నేతల క్యూ
- కార్యకర్తలు,అభిమానుల సమీకరణ
- నియోజకవర్గాల వారీ ఏర్పాట్లు
- బస్‌లు, కార్లలో తరలింపు
- ప్రత్యేకంగా విందు భోజనం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పసుపు పండుగకు జనం సన్నద్ధమయ్యారు.. తండోపతండాలుగా నాయకులు.. కార్యకర్తలు తరలివెళ్లేలా నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కడపలో ఈ నెల 27,28,29 తేదీల్లో టీడీపీ మహానాడు పండుగ నిర్వహించనున్నారు. ఆ పండుగలో భాగస్వామ్యం కావడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పసుపు దండు కదలనుంది. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల నాయకత్వంలో వేలాదిగా తరలివెళ్లనున్నారు. ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో మహానాడుతో పాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటగా జరగబోయే ఈ మహానాడు కడపలో బ్రహ్మాండంగా నిర్వహించనున్నారు. వైసీపీ అధినేత జగన్‌కు అడ్డాగా ఉన్న కడపలో టీడీపీ గత ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే.ఇవాళ మహానాడు ఘనంగా నిర్వహించడం ద్వారా అక్కడ తమ సత్తా ఏంటో చూపాలనేది టీడీపీ వ్యూహంగా కనిపి స్తోంది. మహానాడు నిర్వహణకు 19 కమిటీలు నియమించిన సంగతి తెలిసిందే. అందులో ముఖ్యమైన తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామ కృష్ణుడు వ్యవహరించడంతో పాటు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.పలు కమిటీల్లో మన ప్రాంత నేతలు కొందరు నేతలు సభ్యులుగా నియమితులయ్యారు. కార్యకర్తలకు కొంతమందికి ఇప్పటికే నామినేటెడ్ పదవులు దక్కాయి. వందలాది పోస్టులు రానున్నాయి. ఈ నేపథ్యంలో మహానాడులో పాల్గొనడానికి టీడీపీ శ్రేణులు బాగా ఉత్సాహ పడుతున్నాయి.గత వైసీపీ అరాచక పాలన నుంచి బయటపడిన ఆనందంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోనూ మహానాడు సన్నాహక సభలు పెట్టుకోవడంతో పాటు జిల్లాల మినీ మహానాడు ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. అందరిలోనూ జోష్ పెరిగింది.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మహానాడులో కచ్చితంగా పాల్గొనాలనే ఆలోచనతో అమెరికా టూర్‌ను మధ్యలోనే ఆపుకుని రావడం గమనార్హం. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ పసుపుదండు ఛలో మహానాడు అంటూ బయలుదేరనుంది.



మహానాడుపై చర్చిస్తున్న మంత్రి సుభాష్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

కడప 950 కి.మీ

ఈ మేరకు నాయకులు ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి కడపకు 950 కిలోమీటర్లు.. కాకినాడ, కోనసీమ నుంచి వెయ్యి కిలోమీటర్లు దాటి ఉంటుంది.రోడ్డు మార్గాన వెళ్లాలంటే 9 గంటలు పైనే పడుతుంది. ఈ నేపథ్యంలో ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం స్నాక్స్.. రాత్రికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీన ఉదయం నుంచే మహానాడు కార్యక్రమం ఆరంభిస్తారు. ఆ సమయానికి అక్కడకు చేరుకునేలా ప్రణాళిక రచిస్తున్నారు.. నియోజకవర్గాల వారీ తరలివెళ్లేలా చూస్తున్నారు. ఏ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆ నియోజకవర్గ ఏర్పాట్లు చేశారు.



పుష్కరానికి పనులయ్యేనా!

నేటికీ కదలని అఖండ గోదావరి ప్రాజెక్టు

- రూ.94 కోట్లు నిధులు విడుదల
- పుష్కరఘాట్‌కు టెండర్ ఖరారు
- అభివృద్ధికి ఎదురుచూపులు
- అయినా ఆరంభంకాని పనులు
- అఖండ గోదావరి ప్రాజెక్టు జాప్యం
- పట్టించుకోని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరి ప్రాజెక్టుకు పుష్కలంగా నిధులు వచ్చినా.. పనులు ఆరంభించడంలో అధికారులు జాప్యం చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా బోటు మీద గోదావరి నదిలో పయనించి పర్యాటరంగానికి ఇది చాలా అనువైన ప్రాంతమని భావించారు. వెంటనే అఖండ గోదావరి ప్రాజెక్టు పేరిట రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అఖండ గోదావరి టూరిజానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.ఈ మేరకు అనుకున్నదే తడవుగా రీజినల్ కార్యాలయం పెట్టారు. అధికారినీ నియమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయ డానికి , హేవలాక్ బ్రిడ్జిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ఉపక్రమించారు. కానీ తర్వాత ప్రభుత్వం మారడంతో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, కార్యాలయం ఎత్తేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయంతో నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి విజయం సాధించడం,ఆయన ముఖ్యమంత్రి కావడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ అఖండ గోదావరికి ప్రాణం పోశారు. పైగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా రాజమహేంద్రవరానికి చెందిన కందుల దుర్గేష్ ఉన్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ సాసాతో రూ.94 కోట్లు శాంక్షన్ చేశారు. నిధులు వచ్చేశాయి.ఈ ప్రాజెక్టు కింద రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌ను ఆధ్యాత్మికంగా, పర్యాటక కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు.డిజైన్లు సిద్ధమైనట్టు సమాచారం. ఇటీవల టెండర్లు ఖరారు చేశారు. ఇక్కడ మ్యూజిక్ టవర్, నక్షత్ర స్తంభం, ఓం సింబల్, నదిలో నీళ్లు తాగున్నట్టు ఏనుగు విగ్రహాలు.. పలు అభివృద్ధి పనులు చేయనున్నారు. నిధులున్నా ఇంకా పనులు ఆరంభించలేదు. వచ్చేది వర్షాకాలం, వరదల సమయం కావడంతో పుష్కరఘాట్‌లో పనులకు ఆటంకం కలుగు తుంది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జిని పర్యాటక కట్ట డంగా అభివృద్ధి చేయడం, కడియం నర్సరీల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, కడియపులంక కాలువలో బోట్ షికారు,నిడదవోలు కోట సత్తెమ్మ గుడి వద్ద భక్తుల వసతి భవనం,శెట్టిపేట వద్ద కాలువలో బోట్ షికారు వంటి పనులు ఉన్నాయి.ఇంకా టెండర్లు పిలవలేదు.పనులైతే పుష్కరాల నాటికి ప్రభుత్వం యోచించినట్టుగా ఈ ప్రాం తం అభివృద్ధి చెందుతుంది.

రాజమహేంద్రవరం అభివృద్ధి చేసింది నేనే!



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

- నేనేంటో నగర ప్రజలకు తెలుసు
- గత పుష్కరాలకు ఎవరున్నారు..
- తెలుగు వర్సిటీకి పాటుపడ్డా
- చంద్రబాబు, పవన్‌ను కోరా
- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం చరిత్రలో బుచ్చయ్యచౌదరి మమేకమై ఉన్నాడని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో తన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నాడు ఎన్టీఆర్ తెలుగు వర్సిటీకి తన స్వహస్తాలతో శంకుస్థాపన చేసి అప్పట్లో 190 ఎకరాలతో ఉన్న భూమిలో కొంత భాగాన్ని కేటాయించారన్నారు. ఇందులోనే ప్రస్తుతం నాక్ భవనం, పాలిటెక్నిక్ కళాశాల,కలెక్టరేట్ తదితర సముదాయాలు ఉన్నాయన్నారు. తెలుగు వర్సిటీకి కేటాయించిన దానిని అప్పట్లో అభివృద్ధి చేశారని..దీనికి చరిత్ర ఉందన్నారు.ఇది తెలియని వారు కొత్తకొత్తగా తామేదో ఉద్ధరించినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.గత పుష్కరాలు.. అంతకు ముందు పుష్కరాలకు నగరంలో రహదారులు విస్తరించి అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు రహదారులు విస్తరించే దమ్ము వీరికి ఉందా అని ప్రశ్నించారు.ఆక్రమణల తొలగింపు పేరుతో పేదోళ్లపై ప్రతాపం చూపుతున్నారని విమర్శించారు.గోదావరి బండ్ రోడ్డులో గౌతమి నందనవనం, పీవీ.నరసింహరావు పార్కు, ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. సెంట్రల్ లైటింగ్ తెచ్చామన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారి విగ్రహం పగిలిపోతే ఎవ్వరు పట్టించుకోలేదని తానే కట్టించానన్నారు. ఆటోనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ,ఈఎస్ఐ ఆసుపత్రికి తానే కృషి చేశానన్నారు.చరిత్ర తెలియని వారు ఏదేదో మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,మంత్రి లోకేశ్‌లను కోరానన్నారు.తెలుగు వర్సిటీ ఏర్పాటు విషయం తొలుత మంత్రి కందుల దుర్గేష్ నోటీస్‌కు వచ్చి ఉంటుందన్నారు. ఆయన కూడా సపోర్ట్ చేశారన్నారు.ఇదేదో ఒక్కరే సాధించినట్టు చెప్పుకోవడం సరికాదన్నారు.అలా చెప్పాల్సి వస్తే సుబ్రహ్మణ్య మైదానంలో సభ పెట్టి మాట్లాడాల్సి వస్తుందని..అప్పుడు ఎవరు ఏమి చేశారో తేలుతుందన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేసి టీడీపీని పటిష్టం చేశారన్నారు. కడపలో జరిగే మహానాడుకు లక్షలాది మంది కార్యకర్తలు తరలివస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టీడీపీ రూరల్ అధ్య క్షుడు మత్సేటి శివసత్యప్రసాద్, టూరిజం డవప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సెక్రటరీ జానీ బాషా

పిల్లల గారాబం వద్దు

డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ

రాజమహేంద్రవరం సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా పిల్లల మనోభావాలను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ జానీ బాషా అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ ఉమెన్స్ కళాశాల ఎదురుగా గల కెవి స్టేట్ హోంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినంలో మాట్లాడారు. పిల్లలను గారాబం చేయకుండా క్రమశిక్షణతో పెంచాలన్నారు.న్యాయ సమస్యలుంటే ఉచిత హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సూర్యప్రభావతి మాట్లాడుతూ పిల్లలను ప్రేమగా పెంచాలన్నారు.ఆర్‌పీఎఫ్ సీఐ రాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 73 వేల మంది బాలలు రికార్డుల ప్రకారం తప్పిపోవడం ఆందోళనకరమన్నారు.సదస్సులో బి.జగదీష్,కె.రాజు, శ్రీగౌరి, జెవివి.రమణ, సిహెచ్ శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.





నాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం..నేటి నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ భవనం..ఈ భవనం ఎక్కడిదంటే రాజమహేంద్రవరం ప్రజలు ఠక్కున చెబుతారు.. ఎందుకంటే ఈ భవనంతో అంత అనుబంధం.. 1857లో ఈ భవనాన్ని నిర్మించారు.1923లో ఆధునీకరించారు.. కాలక్రమంలో రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయంగా వినియోగించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

జవహర్‌కు దళిత నాయకుల అభినందనలు



కొవ్వూరులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

కొవ్వూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన కేఎస్ జవహర్‌ను ఆచంట, దెందులూరు నియోజక వర్గాలకు చెందిన దళిత నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఇందులో సిర్రా బాలాజీ, కాపా డెక్కలయ్య, తానేటి మదన్, ఆకుమర్తి యేసయ్య,ఎంఆర్‌పీఎస్ నాయకులు కె. పెద్దిరాజు, డి.వెంకటేశ్వరరావు, సీహెచ్ రాజీకుమార్, యు.ఆనంద్‌కుమార్, రాజేష్, ఎం. ఆనందరాజు, కె. ముఖేష్, మహేష్, బ్రాహ్మణ చెర్వు, దెందులూరు, పాలకొల్లు నియోజకవర్గాలకు చెందిన ఎంఆర్‌పీఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

సుందరేశ్వరుడికి విశేష పూజలు



సుందరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలా త్రిపురసుందరి సమేత సుందరేశ్వరస్వామికి ఆదివారం మహన్యాస పూర్వక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర్‌గణేష్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో విశేషపూజలు జరిగాయి. విఘ్నేశ్వర పూజ, మహన్యాస పూర్వక పంచామృత అభిషేకాలు, లక్ష బిల్వపత్ర పూజ, బాలాత్రిపుర సుందరి అమ్మ వారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి దేవతామూర్తులను విశేష అలంకరణ చేశారు. దీనిలో భాగంగా భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

లంక భూముల్లో .. ఇసుక తవ్వకాలకు ప్రజాభిప్రాయ సేకరణ



గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక లంక భూముల్లో సొంత పంట భూమి గల రైతులు తమ పొలాల్లో పేరుకు పోయిన ఇసుకను అమ్ముకోవడానికి గతంలో మైనింగ్ అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు. ఈ విషయమై ఆదివారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఆధ్వర్యంలో ప్రక్కిలంక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిం చారు. ఆర్డీవో రాణీసుస్మిత మాట్లా డుతూ కార్యక్రమంలో గ్రామస్థులను మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు, సమస్యలు ఏమైనా ఉన్నచో తెలపాలన్నారు, మీరు ఇచ్చే సలహాలు, సూచనలు, సమస్యలు అన్నీ రికార్డు చేసి స్టేట్ లెవెల్ అధికారులకు పంపడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు గ్రామస్థులు తమ సూచనలు లిఖిత పూర్వకంగా ఆర్డీవోకు అందచేశారు. కార్యక్రమంలో ఏడీ మైన్స్ ఫణిభూషణ్‌రెడ్డి, ఏపి కంట్రోల్ బోర్డు ఈఈ శంకరరావు, స్థానిక రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

తడబడితే... కాలువలోకే!

● శిథిలావస్థలో కాకరపర్రు కాలువ వంతెన

● ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్న స్థానికులు



కాకరపర్రు వద్ద వెదుళ్లను రక్షణ గోడలా కట్టిన దృశ్యం

పెరవలి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరపర్రు గ్రామశివారు కోడేరు కాలువపై ఉన్న వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతినడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా గోదావరి లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులకు ఈ వంతెనే ప్రధాన జీవనాధారం. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకోవాలన్నా, ఎరువులు , ఇతర వస్తువులు పొలాలకు తెచ్చుకోవాలన్నా... దీనిపైనే ఆధారపడుతుంటారు. అయితే వంతెన కంటే ఏటిగట్టు ఎత్తుగా ఉండటం వల్ల అప్రోచ్ రోడ్డు ఎక్కడానికి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో తాత్కాలికంగా వెదుళ్ల సాయంతో గోడలా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇలా ఉండటం వల్ల మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారు కాస్త తడబడి నేరుగా కాలువలో పడే ప్రమాదం ఉంది. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకొని అప్రోచ్ రోడ్డును పటిష్టం చేసి, ఇరువైపులా రక్షణగోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

అనపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి) : పొలమూరు గ్రామ దేవత వనుములమ్మ జాతర మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దర్శనానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మహానాడుకు ఏర్పాట్ల సమీక్షలో ఎమ్మెల్యే మద్దిపాటి



కడపలో జరిగిన సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు ఏర్పాట్లకు సంబంధించి రవాణా కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నియమితులయ్యారు. అందులో భాగంగా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కడప జిల్లా అతిథి గృహంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే నాయకులు, కార్యకర్తల వాహనాల నిర్వహణ, తదితర అంశాలపై చర్చించామన్నారు. పలువురు టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయాలి : ఎమ్మెల్యే ముప్పిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న టీడీపీ మహానాడుకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని నియోజక వర్గ కార్యాలయంలో ఆదివారం పాత్రికేయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు 1982లో పార్టీని స్థాపించారన్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని ప్రతి ఏటా మహానాడు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. నియోజక వర్గంలోని మూడు మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, కురుకూరి శివరామకృష్ణ, వేమగిరి వెంకట్రావు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



బ్రాహ్మణగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహం

చాగల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ గూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంచ ముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి వేడుకగా ప్రారంభం కానున్నాయి. విగ్రహ దాతలు దాపర్తి సత్యనారాయణ, గోపాల క్రిష్ణవేణి దంపతులు, తదితర దాతల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. సోమవారం భక్తజన సందోహంతో స్వామివారి గ్రామోత్సవం వేడుకగా జరుగుతుంది. మంగళవారం ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు, బుధవారం పూర్ణాహుతి, ప్రథమ దర్శనం, ఆశీర్వచనం, పండిత సత్కారం, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చాగల్లు హైస్కూల్లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చాగల్లు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 - 2000 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. నెలటూరు సీతారామ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో ఆనాటి మిత్రులు సుమారు 50 మంది వరకు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. వారి ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 25 సంవత్సరాలు తరువాత ఈవిధంగా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతివారు తమను పరిచయం చేసుకుంటూ ప్రస్తుతం ఉన్న పరిస్థితిని తెలియజేశారు. అనంతరం కొంతమంది పూర్వవిద్యార్థులు మాట్లాడారు. కార్యక్రమంలో పెంజర్ల రాజేష్ (యూఎస్‌ఏ) గారపాటి శ్రీనివాస్, కోడి పోసిబాబు, సీహెచ్ చిరంజీవి, నాగేంద్ర, తదితరులు ఈ సమ్మేళనం కోసం చేసిన కృషిని పలువురు అభినందించారు.

రేగులమ్మ వారి జాతర ప్రారంభం



పెద్దాపురంలో జాతర సందర్భంగా గరగనృత్యాలు చేస్తున్న దృశ్యం

గోపాలపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో కొలువై ఉన్న రేగులమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర కమిటీ, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ నుంచి జూన్ 8వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని కమిటీసభ్యులు తెలిపారు. 2007లో అమ్మవారి జాతర జరిపారని, మళ్లీ 18 సంవత్సరాల తరువాత మరోమారు గ్రామస్థుల సహకారంతో అమ్మవారి జాతర జరిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారిని అత్తింటి నుంచి పుట్టింటికి తెస్తారు. జాతర అనంతరం పుట్టింటి నుంచి అత్తవారి ఇంటికి పంపించటం ఆనవాయితీ. జాతరలో గరగనృత్యాలు ఆకట్టుకున్నాయి.

క్రికెట్ విజేత దుద్దుకూరు జట్టు

● విన్నర్‌కు రూ. 55 వేలు, రన్నర్‌కు రూ.22 వేల నగదు అందజేత

దేవరపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదవోలులో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌కు ఉభయ గోదావరి జిల్లాల్లోని 40 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో దుద్దుకూరు టీమ్ ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో రూ.55 వేల నగదును జట్టుకు అందజేశారు.అలాగే ద్వితీయ స్థానాన్ని యాదవోలు టీమ్ కైవసం చేసుకోగా, రూ. 22 వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సున్నం నాగవరప్రసాద్, ఎంపీటీసీ తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు నుదురుమాటి శ్రీనివాస్, జనసేన నాయకుడు అనిశెట్టి శ్రీనివాస్, నీటి సంఘం నాయకుడు ఈరిశెట్టి రామకృష్ణ, స్థానికులు ఎలికె నాగశ్రీను, యర్రగొళ్ల అంజిబాబు, వల్లూరి పండు, సూర్య చంద్రరావు, అనిశెట్టి అప్పారావు, యాదవోలు మెగా క్రికెట్ టీమ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు



నిడదవోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజు పాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మకి ఆదివారం ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి హుండీని లెక్కించగా రూ. 1,50,697 వచ్చినట్టు ఈవో వి. హరిసూర్యప్రకాష్ తెలిపారు. దేవస్థాన ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ మండల నూతన కమిటీ ఎన్నిక

గోపాలపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల మానవతా సంస్థ నూతన కమిటీని ఆదివారం అచ్చన్నపాలెంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ పేర్కొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పుల్లలపాడుకి చెందిన పాకలపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా చీపురుగూడెంకి చెందిన ప్రత్తిపాటి రాంబాబు, కోశాధికారిగా నల్లజర్లకు చెందిన ఐడీవీ అప్పారావు, మిగతా సభ్యులను ఎన్నుకున్నారు. మండల చైర్మన్ బోగవల్లి వెంకట సుబ్బారావు, కన్వీనర్ గుళ్లపూడి వెంకటరత్నం, అయినపూడి రత్నాజీ, పాతూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



నిడదవోలులో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ఎన్టీఆర్ కాలనీలో రామదత్తా భక్త హనుమాన్ 108 చాలీసా భక్త బృందం వారి ఆధ్వర్యంలో చవ్వా రవి కుమార్, లక్ష్మణ్‌కుమార్ ఇంటి వద్ద ఆదివారం 14వ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకులు, సింధూరం పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో చవ్వా రవికమార్, లక్ష్మణ్‌కుమార్, గమిని వెంకటరత్నం, వై. కృష్ణాచార్యులు, మాజేటి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: హనుమాన్ జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వడ్లూరులోని అభయాంజ నేయస్వామివారి ఆలయ వార్షిక మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీనేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దూరులో 'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నేతలు



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం కోట్లాది మంది ప్రజలను మేల్కొల్పుతుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కొవ్వూరు మండలం మద్దూరులో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షురాలు డేగల సునీత నివాసం వద్ద మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా వివిధ ప్రాంతాలలో జరుగుతున్నవంటి విషయాలను దేశ ప్రజలతో పంచుకుంటూ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మారుమూల ప్రాంతాలలో దాగి ఉన్న భారతీయుల శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రపంచానికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కోడూరి లక్ష్మీనారాయణ, కరుటూరి జగదీశ్వరరావు, ముప్పరాజు శ్రీనివాస్, పోణంగి పవన్, శివకృష్ణ, నాగమణి, శ్రీను, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు



పెరవలి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

పెరవలి, మే 25(ఆంధ్రజ్యోతి): ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గత 23 రోజులుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు లాలాలజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్ జీవితవిశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే కథల పుస్తకాలను చదివించి, వారి చేత పుస్తక సమీక్ష చేయించారు. రిసోర్స్‌పర్సన్ ఎన్. పుష్పావతి, స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్‌పై బోధించారు. అనంతరం క్విజ్ నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. అలాగే పెరవలి శాఖా గ్రంథాలయాన్ని రిటైర్డ్ ఎంఈవో వై. పైడియ్య సందర్శించారు. విద్యార్థులకు గేయాలు నేర్పించడంతో పాటు కూల్‌డ్రింక్స్ వల్ల కలిగే అనార్థాలపై వివరించారు. తీపర్రు శాఖా గ్రంథాలయంలో 23వ రోజు వేడుకలు ఉత్సాహంగా జరిగారు. రిసోర్స్‌పర్సన్ కేవీఎస్‌వీ సాత్విక్ విద్యార్థులకు కథలు చెప్పారు.